
సాక్షి నిర్మల్

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



ఆత్మహత్యలు ఆగేదెలా?

బాసర గోదావరి తీరం వద్ద ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఇక్కడికి వచ్చి వంతెనపై నుంచి నదిలో దూకుతున్నారు. వంతెన సూసైడ్ స్పాట్‌గా మారింది.

8లో▸

నిలకడగా 'కడెం' నీటిమట్టం

కడెం: కడెం ప్రాజెక్టులో నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 696.350 అడుగుగా ఉంది. ప్రాజెక్టులోకి 1,801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కుటుంబ సమేతంగా కడెం ప్రాజెక్టును సోమవారం సందర్శించారు. బోటింగ్ చేశారు. ప్రాజెక్టు అందాలను వీక్షించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /24.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన భైంసా మున్సిపల్ కమిషనర్



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వైస్‌చైర్మన్

భైంసాటౌన్: భైంసా మున్సిపల్ కమిషనర్‌గా బి.రాజేశ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీలో డిప్యూటీ కమిషనర్‌గా చేసిన ఆయన్ను భైంసా మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టగా, వైస్‌చైర్మన్ ఎండీ.జాబీర్‌అహ్మద్, కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్, మేనేజర్ గౌరీశ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న ఏఎస్పీ, సీఐ

భైంసాటౌన్: ప్రతీ దుకాణదారు తప్పనిసరిగా దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సూచించారు. సీఐ రాజారెడ్డితో కలిసి పట్టణంలోని పలు దుకాణాలను సోమవారం పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోని పలువురు దుకాణదారులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్ యాక్ట్ ప్రకారం తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో నోటీసు ఇచ్చిన 15 రోజులకు రూ.5 వేలు, నెలలోపు రూ.10 వేల జరిమానా వసూలు చేస్తామని తెలిపారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



డాక్టర్ సురేశ్‌ను సన్మానిస్తున్న వైద్యులు

నర్సాపూర్(జి): వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని నిర్మల్ జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ సురేశ్ అన్నారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆసుపత్రిని సోమవారం సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. మొదటిసారి ఆసుపత్రికి వచ్చిన సూపరింటెండెంట్‌ను డాక్టర్లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేక వైద్యులు డాక్టర్ సుమల, డాక్టర్ సురేందర్, డాక్టర్ మమత, డాక్టర్ రాకేశ్, హెడ్‌నర్సు లలిత , స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.


కడెం ఎఫ్‌ఆర్వోగా గీతారాణి



గీతారాణికి స్వాగతం పలుకుతున్న అధికారులు

కడెం: కడెం ఎఫ్‌ఆర్వోగా ఎల్.గీతారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ ఎఫ్‌ఆర్వోగా పనిచేసిన చోలే అనిత ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు బదిలీపై వెళ్లారు. నూతన ఎఫ్‌ఆర్వోకు అటవీ అధికారులు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఇందులో రేంజ్ సిబ్బంది ప్రకాశ్, సిద్ధార్థ, రవి, శివకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోరిగాం వాసికి ఏఈఈ ఉద్యోగం



మహేశ్

లక్ష్మణచాంద: ఇటీవల ప్రకటించిన ఏఈఈ ఫలితాల్లో మండలంలోని బోరిగాంకు చెందిన భక్తుల మహేశ్ ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన భక్తుల మల్లయ్య– స్వరూప దంపతుల కుమారుడు మహేశ్ పదో తరగతి వరకు ఇచ్చోడలోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్ బోధన్‌లో, బీటెక్ మంథని జేఎన్టీయూలో పూర్తిచేశాడు. మూడు రోజుల క్రితం వెలువడిన ఏఈఈ ఫలితాలలో మహేశ్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

పైరవీలకే పెద్దపీట!

- విద్యాశాఖలో అక్రమ డిప్యూటేషన్లు..
- సమీపంలో ఖాళీలు ఉన్నా.. నచ్చినచోట పోస్టింగ్..!
- విద్యార్థుల అవసరాన్ని పట్టించుకోని వైనం..
- యూనియన్ నేతల చేతుల్లో డీఈవో



ప్రజావాణిలో డీఈవో రవీందర్‌రెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నిర్మల్: జిల్లా విద్యాశాఖ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారిపైనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం దృష్టిలో నిబంధనల ప్రకారం బదిలీలు చేపడుతూనే.. మరోదిక్కు డిప్యూటేషన్ల పేరిట అక్రమాలకు పాల్పడుతున్న తీరుపై ప్రజావాణి వేదికగా ఉన్నతాధికారుల వరకూ ఫిర్యాదులు వెళ్తున్నాయి. కొన్నేళ్లుగా అక్రమ డిప్యూటేషన్ల తతంగం నడుస్తూనే ఉంది. ఇటీవల బదిలీల తర్వాత మళ్లీ ఈ కథలు బయటకు రావడం, నేరుగా డీఈఓపైనే ఆరోపణలు రావడం ఉపాధ్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మాకెందుకివ్వరూ..

విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం నిబంధనల ప్రకారం పదోన్నతులు, బదిలీలను చేపట్టింది. కానీ.. కొంతమంది రాకపోకల ఇబ్బందులను తప్పించుకోవడానికి డిప్యూటేషన్లను అక్రమంగా వాడుకుంటున్నారు. ఇటీవల ముగ్గురికి డీఈవో డిప్యూటేషన్లను ఇవ్వడం, ఇందులో కొంతమంది యూనియన్ నేతలూ ఉండటంతో మిగిలిన ఉపాధ్యాయులు దీనిపై మండిపడుతున్నారు. వారికి ఇచ్చినట్లే తమకూ డిప్యూటేషన్లు ఇవ్వాలని కుభీర్, తానూరు, బాసర, కడెం, పెంబి వంటి మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

వాళ్లు చెప్పినట్లే చేస్తున్నారా..?

కొంతమంది యూనియన్ నేతలు చెప్పినట్లే జిల్లా విద్యాశాఖాధికారి చేస్తున్నారా..! లేక డీఈవో సదరు నేతలకు వత్తాసు పలుకుతున్నారా..? అంటూ ఉపాధ్యాయవర్గాలు ప్రశ్నిస్తున్నాయి. జిల్లాలో ఇంతమంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ కొందరికే ఎందుకు ప్రయారిటీ ఇస్తున్నారని అడుగుతున్నారు. ప్రధానంగా ఉపాధ్యాయులు దూరప్రాంతాల్లో పనిచేసేందుకు శ్రద్ధ చూపడం లేదు. పిల్లల చదువులతోపాటు తమ వ్యాపకాల కోసం జిల్లాకేంద్రం, సమీపంలోని మండలాల స్కూళ్లలోనే పనిచేయాలని భావిస్తున్నారు. ఈక్రమంలోనే ఇటీవల బదిలీలు, పదోన్నతుల్లో దూరప్రాంతాలకు వెళ్లిన వారు పైరవీలు చేస్తున్నారు.

డీఈవో తీరుతో పేద విద్యార్థులకు అన్యాయం

ఖానాపూర్: జిల్లా విద్యాధికారి తీరుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా మారిందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు ఆరోపించారు. ఖానాపూర్ బస్టాండ్ సమీపంలోని తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లి దండ్రులతో కలిసి ప్రజావాణిలో డీఈవోపై ఫిర్యాదు చేశారు. పాఠశాలలో పనిచేయాల్సిన ఉపాధ్యాయురాలిని డీఈవో నిర్మల్ మండలానికి డిప్యూటేషన్ ఇచ్చి పేద విద్యార్థులకు తీవ్రనష్టం చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రత్యేక చొరవతో బడిని ప్రారంభిస్తే డీఈవో ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై కేటాయించారని తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో విద్యార్థుల తల్లిదండ్రులు జియా, షాకిర్, శ్రీనివాస్, ఇసాక్ తదితరులు ఉన్నారు.

'లెక్క'ప్రకారం అక్కడుండాలి..

పదో తరగతి ఫలితాల్లో వరుసగా రెండుసార్లు టాప్‌లో నిలిచి రాష్ట్రంలోనే భేష్ అనిపించుకున్న జిల్లా విద్యాశాఖ ఇప్పుడు విమర్శల పాలవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ పోస్టింగ్‌లు, బదిలీలు, డిప్యూటేషన్లను చేస్తున్న తీరుతో అభాసుపాలవుతోంది.

- జిల్లాకేంద్రానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీల్లో పదోన్నతిపై నిర్మల్ రూరల్ మండలం నుంచి భైంసా మండలానికి బదిలీ అయ్యాడు. అక్కడి స్కూల్‌లో దాదాపు వంద మంది విద్యార్థులు ఉండగా, ఈయన ఒక్కరే సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు. అయినా.. సదరు ఉపాధ్యాయుడిని అక్కడి నుంచి కేవలం 40 మంది విద్యార్థులు ఉన్న నిర్మల్‌రూరల్ మండలంలోని ఓ పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు.
- తానూరు మండలంలోని ఓ హైస్కూల్ నుంచి ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుడిని సాంఘిక శాస్త్రం బోధించేందుకు సదరు భైంసా మండలం పాఠశాలకు డిప్యూటేషన్ ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం.
- ఖానాపూర్ మండలంలో ఎస్‌జీటీల ఖాళీలు ఉన్నప్పటికీ అక్కడి ఓ ఉపాధ్యాయురాలిని నిర్మల్ మండలంలో జిల్లాకేంద్రం సమీపంలోని ఓ పాఠశాలకు డిప్యూటేషన్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.
- విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఎస్జీలను వారు పనిచేస్తున్న మండలంలో ఖాళీలు ఉంటే అక్కడే డిప్యూటేషన్ ఇవ్వాలి. కానీ.. జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న గ్రామానికి ఇవ్వడం డీఈవోపై ఆరోపణలకు కారణమవుతోంది.

'ప్రజావాణి' అర్జీలు
త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణికి వచ్చే అర్జీలు త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత శాఖలకు వాటిని అందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- నిర్మల్ పట్టణంలో చైన్‌గేట్ నుంచి బంగల్‌పేట్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణలో తన ఇల్లు కోల్పోయానని, తనకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని జక్క వెంకటమ్మ వినతిపత్రం అందించింది.
- సోన్ గ్రామానికి చెందిన 550 మంది ఇండియన్ బ్యాంకులో పంట రుణం తీసుకున్నామని, ఇటీవల చేసిన మాఫీలో తమ రుణాలు మాఫీ కాలేదని రైతులు విన్నవించారు.
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి జిల్లా అధ్యక్షులు వాగ్మారే మహేందర్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందించారు.
- ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు.
- వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందించారు.

ఎత్తిపోతల పథకం పకడ్బందీగా నిర్వహించాలి



కలెక్టరేట్ ఆవరణలో గడ్‌చాంద గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాందలోని లక్ష్మీనర్సింహా ఎత్తిపోతల పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని గడ్‌చాంద గ్రామస్తులు కోరారు. ఎత్తిపోతల పథకానికి మంజూరైన నిధుల దుర్వినియోగంపై ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం రూ.24 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు.



స్వచ్ఛ సెల్ఫీ పాయింట్

నిర్మల్‌చైన్‌గేట్: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛ నిర్మల్ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సెల్ఫీ పాయింట్‌ను డీఆర్డీవో విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు.

పరిసరాల పరిశుభ్రతకు
ప్రాధాన్యం ఇవ్వాలి



నిర్మల్ పట్టణంలో స్వచ్ఛదనం పచ్చదనం ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్

- 'స్వచ్ఛదనం–పచ్చదనం'లో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్/దిలావర్‌పూర్: స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని బాగులవాడచౌరస్తా నుంచి ద్యాగవాడ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. దిలావర్‌పూర్ మండలం న్యూలోలం గ్రామంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత, మొక్కలు నాటడం, నీటి సంరక్షణ తదితర అంశాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దిలావర్‌పూర్ పంచాయతీ ఆవరణలో విద్యార్థులు, గ్రామస్తులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తూ, ప్రతీ ఇంటినుంచి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్‌ను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలను అందించారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీపీవో శ్రీనివాస్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్, మండల ప్రత్యేకాధికారి శంకర్, తహసీల్దార్ స్వాతి, ఎంపీవో గోవర్ధన్, ఏపీవోదివ్యారెడ్డి, ఏపీఎం సులోచన, ఆర్డీవో రత్నకళ్యాణి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ రాజు, మెప్మా పీడీ సుభాష్, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పచ్చదనం..పరిశుభ్రత అందరి బాధ్యత

కడెం: పచ్చదనం.. పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. ఆయా శాఖల అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. ఎంపీడీవో అరుణ, ఏపీవో జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



కలెక్టర్‌కు పూల మొక్క అందిస్తున్న మేధశ్రీ

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన వడ్లాటి లక్ష్మి–మధుమోహన్ దంపతుల కుమార్తె మేధశ్రీ రచించిన ఆంగ్ల నవలలను కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఆవిష్కరించారు. మేధశ్రీ నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. విద్యార్థిని 'మై ఫెయిరీ ఫ్రెండ్ అండ్ అదర్ పోయెమ్స్ 'అనే ఆంగ్ల కవితా సంకలనం రచించింది. చిన్న వయసులోనే ఆంగ్ల రచయిత్రిగా పుస్తకం రాయడం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. చిన్నారి ప్రయత్నం ఎంతో మంది పిల్లలకి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులతోపాటు వాసవి వరల్డ్ స్కూల్ డైరెక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజైసన్ తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులకు 'శ్రీరామ' రక్ష

- ఆయకట్టుకు రేపు ఎస్సారెస్పీ నుంచి సాగునీటి విడుదల
- కాకతీయ కాలువ ద్వారా జిల్లా భూములను తడుపనున్న గంగమ్మ
- వరి నాట్లకు సిద్ధమవుతున్న జిల్లా రైతులు



సరస్వతీ కాలువ(ఫైల్)



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

మామడ: నిర్మల్ వ్యవసాయ ఆధారిత జిల్లా.. ఎక్కువ మంది భూమినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఇక జిల్లా భూములకు పొరుగు జిల్లాలో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచే సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు నిండితేనే జిల్లా రైతులు పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉండడంతో వరి సాగుపై రైతులు పునరాలోచనలో పడ్డారు. అయితే ఈనెల 7వ తేదీన ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని ఎస్సారెస్పీ అధికారులు ప్రకటించారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో వస్తుండడంతో అధికారులు ఆయకట్టుకు నీరు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో జిల్లా రైతులు వరి నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. సర్వసతీ కాలువ ద్వారా జిల్లాలో భూములకు సాగునీరు అందుతుంది.

వరిసాగుపై భరోసా...

జిల్లాలోని కడెం, స్వర్ణ ప్రాజెక్టులు నిండటంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. వరిసాగుకు కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ద్వారా గతేడాది ఆరంభంలో వరద నీరు చేరడంతో జూలై మాసంలోనే నీటిని సరస్వతీ కాలువ ద్వారా అందించారు. ఈ యేడాది ప్రాజెక్ట్‌లోకి వరద నీరు చేరక పోవడంతో సరస్వతీ కాలువకు సాగు నీటిని విడుదల చేయడం ఆలస్యం అయింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా సరస్వతీ కాలువ కింద జిల్లాలో 34,864 ఎకరాలకు ఆయకట్టు ఉంది. నిర్మల్‌రూరల్, సోన్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, పెంబి మండలాల రైతులు సరస్వతీ కాలువ కిందనే పంటలు సాగుచేస్తారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో రైతులు సరస్వతీ కింద వరి సాగుకు నార్లు పోసుకున్నారు. అయితే ఎస్సారెస్పీ నీటి విడుదలపై అధికారి ప్రకటన రాక పోవడంతో పునరాలోచనలో పడ్డారు. తాజాగా నీటి విడుదలపై స్పష్టత రావడంతో రైతులు వరి నాట్లకు సిద్ధమవుతున్నారు.

పెరగనున్న భూగర్భ జలాలు....

సరస్వతీ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తుండటంతో పంటపొలాలకు అందించిన నీరు చెరువులకు చేరుతుంది. చెరువులకు చేరిన నీటితో చెరువుల కింద సాగు చేస్తున్న పొలాలకు నీరు అందనుంది. నీటి విడుదల కారణంగా భూగర్భ జలాలు పెరిగి కాలువ సమీపంలో బోరు బావుల ద్వారా సాగు చేస్తున్న రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

అధ్వాన్నంగా కాలువలు...

సరస్వతీ ప్రధాన కాలువతోపాటు 27 డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉన్నాయి. ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్ చాల చోట్ల శిథిలావస్థకు చేరుకుంది. కాలువ దెబ్బతినడం, మరమ్మత్తులు లేని కారణంగా కాలువ పిచ్చిమొక్కలతో నిండి ఉంది. లైనింగ్ దెబ్బతినడంతో నీటిని తక్కువగా కాలువలోకి విడుదల చేయాల్సి వస్తుంది. దీంతో సరస్వతీ కాలువలో డిస్ట్రిబ్యూటరీల వద్ద రైతులు రాళ్లతో కట్టలు కడుతూ నీటిని ఉపకాలువల ద్వారా పొలాలకు మళ్లించుకుంటున్నారు. సరస్వతీ కాలు వ ద్వారా చివరి ఆయకట్టుకు సాగు అందించడం కష్టంగా మారింది. కాలువలకు మరమ్మతు చేసి చివరి ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెరుగుతున్న ప్రాజెక్టు నీటి మట్టం....

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,091 అడుగులు, 90.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1,080 అడుగులు, 45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 16,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. గతేడాది ఆగస్టు 5న ప్రాజెక్టు నీటి మట్టం 1,089 అడుగులు,76 టీఎంసీలు ఉండగా ఈ యేడాది నీటి నిల్వ తక్కువగా ఉంది.

నీటి కోసం ఎదురు చూస్తున్నాం



వరినారు పెరగడంతో నాట్లు వేయడం కోసం సిద్ధంగా ఉన్నాం. సరస్వతీ కాలువ నీరు రాగానే నాట్లు వేస్తాం. నీటి కోసం ఎదురు చూస్తున్నాం. కాలువకు నీరు రావడం ద్వారా కాలువ చుట్టు పక్కల భూగర్భ జలాలు పెరుగుతాయి. బోరుబావుల ద్వారా పంటలు సాగు చేసే రైతులకు ఇబ్బంది ఉండదు.

– రవి, రైతు, చందారం

క్లుప్తంగా

మద్యం దుకాణంలో చోరీ

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లోగల శ్రీవైన్స్‌లో చోరీ జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి పక్కన ఉండే శ్రీవైన్స్ యజమాని ఆదివారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో దుకాణం తెరిచేందుకు రాగా, షట్టర్ తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టణ పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది అక్కడికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వైన్స్ షట్టర్ తాళాలు పగుల గొట్టి లోపలికి చొరబడినట్లు ఫుటేజీలో గుర్తించారు. కాగా, నిందితులు గల్ల పెట్టెలోని రూ.40వేల నగదు, మద్యం బాటిళ్లు దొంగిలించారు. క్లూస్ టీం సిబ్బంది వివరాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: మండలంలోని పిప్పల్‌ధరి, మామిగూడ శివారు ప్రాంతంలో సోమవారం గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. ఆదిలాబాద్‌రూరల్ మండలం పిప్పల్‌ధరి గ్రామపంచాయతీ పరిధిలో గల దహిగూడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మామిడిగూడ వైపు ఆయన గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కాగా, నిందితుడి మామ సిడాం రాజు పంట పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీని విలువ రూ.10వేలు ఉంటుందని తెలిపారు. కాగా, సిడాం రాజు పంట పొలాన్ని పరిశీలించగా మూడు గంజాయి మొక్కలు లభ్యమైనట్లు వివరించారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుప్టి బ్రిడ్జిపై లారీ బోల్తా



బ్రిడ్జి పక్కన బోల్తా పడ్డ లారీ

నేరడిగొండ: మండలంలోని కుప్టి బ్రిడ్జి వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు ఆలుగడ్డల లోడ్‌తో వెళ్తున్న లారీ కుప్టి ఘాట్ సమీపంలోని బ్రిడ్జి పక్కన గల రోడ్డు వద్ద బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ప్రమాదానికి కారణమైన వాహనం స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లిలో ఆదివారం రాత్రి ఆ కాలనీకి చెందిన సంద విఠల్ రోడ్డు దాటుతున్న క్రమంలో ఢీకొన్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజ్ ద్వారా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించారు. కాగా, విఠల్ తీవ్ర గాయాలతో రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

ఆత్మహత్యలు ఆగేదెలా?

- బాసర బ్రిడ్జి వద్ద బలవన్మరణాలు
- గోదావరిలో దూకుతున్న బాధితులు
- స్నానఘట్టాల వద్ద తరచూ ప్రమాదాలు
- నీట మునిగి చనిపోతున్న భక్తులు
- రక్షణ చర్యలు చేపట్టని అధికారులు




గోదావరి నదిలో కొట్టుకువచ్చిన మృతదేహాలు (ఫైల్)

భైంసా: బాసర గోదావరి నదీతీరం వద్ద ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. వివిధ కారణాలతో మహారాష్ట్ర ప్రాంతంతోపాటు నిజామాబాద్ జిల్లా నుంచి వస్తున్నవారు బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. నాలుగురోజుల్లోనే ఇక్కడ నాలుగు మృతదేహాలు లభించాయి. ఒకే రోజు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం బాసర వద్ద గోదావరి నదిలో మరో రెండు మృతదేహాలు కొట్టుకువచ్చాయి. బాసర రైల్వేస్టేషన్‌లో మార్చి 27న ఓ యువతి, యువకుడు నర్సాపూర్–నాగర్‌సోల్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిషిత డిగ్రీ కాలేజీలో చదివిన చక్రవర్తుల నందితతోపాటు మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇలా కుటుంబ కలహాలు, ఇతర కారణాలతో ఎంతోమంది ఇక్కడకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు.

గుర్తించి.. రక్షిస్తున్న స్థానికులు

పలువురు గోదావరిలో దూకే సమయంలో గమనిస్తున్న స్థానిక యువకులు, జాలర్లు, గజ ఈతగాళ్లు వారిని పోలీసుల సహకారంతో కాపాడిన సందర్భాలనేకం. బాధితులు ఆత్మహత్య చేసుకోకుండా స్థానికులు కాపాడుతుండగా పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వారి కుటుంబ సభ్యులను పిలిపించి పంపిస్తున్నారు. బాసర గోదావరి వంతెన నుంచి స్నానఘట్టాల వరకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించాలని పలువురు సూచిస్తున్నారు. ఆత్మహత్యలు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బాసర యువకులు గతంలో ఆందోళన చేసి బాసర ఆలయ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా స్నానఘట్టాల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు.



బాసర వద్ద గోదావరి నది

గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం

గోదావరి నదీతీరం వద్ద ఆందోళనతో కనిపించివారిని గుర్తిస్తున్నాం. పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఆర్నెళ్లలో చాలామంది ప్రాణాలు కాపాడగలిగాం. బాసర యువకులు కూడా ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన వారిని ముందే గుర్తించి మాకు సమాచారం ఇస్తున్నారు. బాధితుల మానసిక పరిస్థితి తెలుసుకుని వారి కుటుంబీకులకు అప్పగిస్తున్నాం.

– గణేశ్, బాసర ఎస్సై

స్నానఘట్టాల వద్ద ప్రమాదాల్లో..

బాసర వంతెన నుంచి సూర్యేశ్వర ఆలయం వరకు కిలో మీటరు మేర స్నానఘట్టాలు నిర్మించారు. వానాకాలంలో గోదావరిలో నల్లమట్టి కొట్టుకువచ్చి స్నానఘట్టాల వద్ద పేరుకుపోతోంది. నల్లమట్టితోపాటు పూజా వ్యర్థాలను వెంటవెంట తొలగించడలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండగా భక్తులు పుణ్యస్నానాలు చేసే సమయంలో జారి గోదావరిలో పడుతున్నారు. పలువురు ప్రాణాలతో బయట పడుతుండగా.. కొందరు నీట మునిగి చనిపోయిన సందర్భాలనేకం. బాసర గోదావరి నది వద్ద తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. స్నానఘట్లాల వద్ద ఏర్పాట్లు సరిగా లేక ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. ఇలా పవిత్ర గోదావరి నదిలో తరచూ మృతదేహాలు కనిపిస్తుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.

ప్రమాదాల్లో పలువురు..

దేశవ్యాప్తంగా నిత్యం వేలాదిమంది భక్తులు బాసరకు వస్తుంటారు. ఇలా వచ్చినవారిలో కొంతమంది పుణ్యస్నానాల సందర్భాల్లో ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్నారు.

- 2022 ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్ బంజారాహిల్స్ సరస్వతి హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల సందర్భంగా బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. గోదావరి నదిలో స్నానాలకు వెళ్లిన విద్యార్థుల్లో విశాల్ (15) ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతిచెందాడు.
- 2022 మే 14న మహారాష్ట్రలోని అకోల పట్టణానికి చెందిన 17 మంది విద్యార్థులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. వీరు నదిలో స్నానం చేస్తుండగా కిరణ్ (22) అనే విద్యార్థి నీటిలో మునిగి అందులోనే ఉండిపోయాడు. గమనించిన మరో విద్యార్థి ప్రదీప్ (22) రక్షించబోయి నీటమునిగి మృతిచెందాడు.
- 2022 జూలై 14వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా కందకూరు మండలం పొన్నులూరు గ్రామానికి చెందిన మణికంఠ (14) అనే విద్యార్థి పుణ్యస్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు మృత్యువాతపడ్డాడు.
- 2023లో మహాశివరాత్రి పర్వదినాన మహారాష్ట్రకు చెందిన ప్రదీప్ (25) అనే యువకుడు పుణ్యస్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు నదిలో మునిగి చనిపోయాడు.
- 2023 అక్టోబర్ ఒకటిన నిజామాబాద్‌లోని పాములబస్తీకి చెందిన సంతోష్ (18) స్నేహితులతో బాసరకు వచ్చాడు. గోదావరి నదిలో స్నానాల కోసం దిగి మృతిచెందాడు.
- 2023 అక్టోబర్ ఆరున నిజామాబాద్‌లోని గాజులపేట్‌కు చెందిన దుబ్బాక ఓడ్డయ్య (35) కూతురు పుట్టు వెంట్రుకలు తీసేందుకు బాసరకు వచ్చాడు. ఆనవాయితీ ప్రకారం శుభకార్యానికి ముందు గోదావరి నదిలో తెప్పను వదిలేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు.
- ఈ నెల మొదటి వారంలోనే నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు భక్తులు చనిపోయారు.

గిరిజన శిక్షణ, ఉపాధి కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన నిరుద్యోగ యువతీయువకుల కోసం గిరిజన శిక్షణ, ఉపాధి కార్యాలయాన్ని కలెక్టర్ రాజర్షి షా సోమవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి ప్రారంభించారు. కార్యాలయం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీయువకులకు ప్రతీ రోజు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగావకాశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజన నిరుద్యోగ యువతీయువకులు ఈ కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. ప్రతీరోజు వందల ప్రైవేట్ ఉద్యోగాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీవో వసంత్‌రావు, జేడీఎం నాగభూషణం, ఎస్‌డీసీ, డీపీవో తదితరులు పాల్గొన్నారు.

8న సింగరేణి, రామగిరి రైళ్ల రాకపోకలు బెల్లంపల్లి నుంచే..

బెల్లంపల్లి: సింగరేణి, రామగిరి రైళ్లు ఈనెల 8వ తేదీన బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చి ఇక్కడి నుంచే తిరుగు ప్రయాణం సాగించనున్నాయి. ఆయా రైళ్ల రాకపోకల సమయ సూచికను రైల్వే అధికారులు తాత్కాలికంగా మార్పు చేశారు. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ శ్రీధర్ సోమవారం ప్రకటించారు. భద్రాచలం రోడ్–బల్లార్షా మధ్య రోజూ రాకపోకలు సాగించే సింగరేణి మెమో (రైలు నంబర్ 17033), బల్లార్షా–కాజీపేట్ మధ్య నడిచే రామగిరి (రైలు నంబర్ 17004) రైళ్లను అప్, డౌన్ మార్గాల్లో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నుంచి నడుపనున్నట్లు తెలిపారు. ఇదేతీరుగా జైపూర్–మైసూర్ మధ్య నడిచే మైసూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 12976) రైలు ఈనెల 7వ తేదీన గంట ఆలస్యంగా నడవనున్నట్లు ప్రకటించారు. మహారాష్ట్రలోని వీరూర్, వీర్‌గామ్ రైల్వేస్టేషన్ల పరిధిలో నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరగా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్‌కు చెందిన గేడం శశిరేఖ తనకు ఏదైనా ఉద్యోగం కల్పించాలని, నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన చౌహాన్ బన్నీ తనకు ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ ఇప్పించాలని, వాంకిడి మండలం లీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం రాము తనకు ఇల్లు మంజూరు చేయించాలని, మామడ మండల కేంద్రానికి చెందిన లక్ష్మి తమ భూమికి పట్టా చేయించాలని కోరారు. పింఛన్, డబుల్‌బెడ్రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏపీవో వసంత్‌రావు, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఆర్సీవో రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయలు, ఆకుకూరలతోనే ఆరోగ్యం



విత్తనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, పీవో

ఉట్నూర్‌రూరల్: ప్రతి ఒక్కరూ రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు ఉపయోగిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. సోమవారం ఐటీడీఏ ఉట్నూర్ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆదిమ గిరిజనులకు (పీవీటీజీలు) ఐటీడీఏ ఉట్నూర్‌లోని కుమురంభీం కాంప్లెక్స్‌లోగల పీఎంఆర్సీ మీటింగ్ హాల్‌లో ఉచితంగా కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. 500 మంది గిరిజన రైతులకు కూరగాయ విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దుర్వినియోగం చేయకుండా ఖాళీ ప్రాంతాలు, పెరటిలో పొలంలో సాగు చేయాలని సూచించారు. అంతకుముందు ఐటీడీఏ పరిధిలోని ఉద్యాన నర్సరీలో చేపట్టిన వివిధ పంటల సాగు, ప్రదర్శన క్షేత్రాలు, వేసవి కూరగాయల సాగు, ఉల్లి, పసుపు, పూలు (బంతి, చామంతి), మునగ, జామ తోటల పెంపకంపై ఐటీడీఏ ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి సందీప్‌కుమార్ అవగాహన కల్పించారు. రైతులకు ఉపయోగపడే శిక్షణ, వివిధ పంటలు సాగుపై అవగాహన కల్పించిన తీరును కలెక్టర్ ప్రశంసించారు.

స్వచ్ఛదనం–పచ్చదనం ప్రారంభం

ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో కలెక్టర్ రాజర్షి షా కొబ్బరి మొక్కలు నాటి స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఏపీవో పీవీటీజీ మనోహర్, ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్, సిబ్బంది జయరాజు, అర్షిత, శ్యామల, చందర్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు తదితరులున్నారు.

వాహనం ఢీకొని ఒకరు మృతి

- మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన



సంద విఠల్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తిర్పెల్లికి చెందిన సంద విఠల్‌ను ఆ కాలనీ సమీపంలోని గంభీర్ హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని కాలనీవాసులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అతడి కుటుంబీకులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాహనాన్ని గుర్తించకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం మృతదేహంతో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించారు. దీంతో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. వారు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. అంతకుముందు మృతదేహానికి పోస్టుమార్టం చేసే సమయానికి పోలీసులు ఆస్పత్రికి రాకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.



టూటౌన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబీకులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



జీజాబాయి (ఫైల్)

నేరడిగొండ: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. ఏఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం దుప్యాతండాకు చెందిన జాదవ్ తుకారాం తన భార్య జీజాబాయితో కలిసి బస్సులో కూతురు ఇంటికి నేరడిగొండ మండలం దేవుల్‌నాయక్ తండాకు వస్తున్నారు. ఈ క్రమంలో నిర్మల్‌లో బస్సు ఎక్కిన వారు దేవుల్‌నాయక్ బస్టాండ్ వద్ద దిగారు. రోడ్డు దాటే సమయంలో నిర్మల్ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డ జీజాబాయి మృతిచెందింది. కూతురు ఇంటికి చేరుకోకముందే రోడ్డు ప్రమాదంలో మృత్యు ఒడికి చేరింది. దీంతో ఆమె కూతురు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ మృతి




సతీశ్ మృతదేహం

ముధోల్: మండలంలోని గన్నోరా గ్రామానికి చెందిన రొమ్మెల్ల సతీశ్ (33) అనే ట్రాక్టర్ డ్రైవర్ చికిత్స పొందుతూ నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సతీశ్ గత నెల 13న ఓ రైతు పొలంలో కేజీవీల్స్‌తో నూర్పిడి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని గ్రామస్తులు, తోటి కూలీలు భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అలేఖ్య హత్య కేసులో దర్యాప్తు వేగవంతం

నిర్మల్ రూరల్: ఖానాపూర్ నడిబొడ్డున గత ఫిబ్రవరిలో అలేఖ్య అనే యువతిని తనను ప్రేమించడం లేదనే కోపంతో ఓ యువకుడు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఎస్పీ షర్మిల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్‌లో అంబేద్కర్ నగర్‌కు చెందిన చెట్‌పల్లి అలేఖ్య అనే యువతని, అదే కాలనీకి చెందిన జుకింది శ్రీకాంత్ అనే వ్యక్తి కొబ్బరి బోండాలు నరికే కత్తితో అతి దారుణంగా నరికి చంపినట్లు పేర్కొన్నారు. ఆపడానికి వెళ్లిన అలేఖ్య వదిన జయశీలను కూడా తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. హత్య అనంతరం దర్యాప్తు వేగవంతం కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు పారిపోయిన కొన్ని గంటల వ్యవధిలోనే అతడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. జ్యుడీషియరీ సహకారంతో కేసు చార్జిషీట్, కేసుకు కావాల్సిన అన్ని సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. సోమవారం ప్రత్యక్ష సాక్షులను ప్రవేశపెట్టినట్లు ఎస్పీ తెలిపారు. కేసు పురోగతిలో ప్రతిభ చాటిన ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి, సిబ్బందిని ఆమె అభినందించారు.



కడెం.. చుట్టూ పచ్చదనం



ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్


అందాల కడెం.. ఆహ్లాదమయం




కడెం: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు నెలవైన కడెం జలాశయం పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. వానాకాలం వచ్చిందంటే పచ్చని ప్రకృతి అందాల మధ్య నిండా నీటితో ప్రాజెక్ట్ ఆకట్టుకుంటోంది. ఎటు చూసినా ప్రకృతి అందాలతో మంత్రముగ్ధులను చేస్తోంది. అణువణువునా సోయగాలు ఒలకబోస్తూ మనస్సుకు హాయినిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ప్రాజెక్ట్‌లో బోటు షికారు ఉల్లాసాన్ని కలిగిస్తోంది. ప్రాజెక్ట్‌ను ఆనుకుని ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణులు పాపికొండలను తలపించి మైమరిపిస్తున్నాయి. నిండా నీటిలో ఐలాండ్, బ్యాక్ వాటర్, సాగునీటికాలువల అందాలు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.



సహ్యాద్రి పర్వత శ్రేణుల అందాలు



ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు



కుడి కాలువ అందాలు